# చీకట్లోంచి చీకట్లోకి

కొండవీటి సత్యవతి

## కథ



పిఠాపురం ఇరుకిరుకు వీధుల్లోంచి కారు మెల్లగా వెళుతోంది. ఊర్మిళ ఉత్తరం రాయకపోతే తనకీ ఊళ్ళో పనే ముంది? తాము పిఠాపురం గుళ్ళో ఏదో యజ్ఞం చెయ్యడానికి ఫలానా రోజు వస్తున్నామని, వీలయితే 'నువ్వూ రా' అంటూ ఢిల్లీ నుంచి ఉత్తరం రాసింది. ఎక్కడి ఢిల్లీ. ఎక్కడి పిఠాపురం.

సంహితకి చాలా ఆశ్చర్యంగా వుంది. ఈ హైటెక్ కంప్యూటర్ యుగంలో కూడా జనం గురువులు, బాబాల ప్రలోభంలో పడి యజ్ఞాలు, యాగాలు చెయ్యడం విచిత్రంగా వుంది. దేనికోసం చేస్తారు యజ్ఞాలు? మంత్రాలకు చింతకాయలు రాలతాయా? సంహిత ఆలోచనల్లో వుండగానే కారు గుడిముందు ఆగింది. గుడి ఆవరణంతా హడావుడిగా వుంది. గుంపులు గుంపులుగా ఆడవాళ్ళు. సంహిత కళ్ళని కట్టిపడేసిన దృశ్యం, గుడి ముందున్న కోనేరూ, దాన్నిండా విచ్చుకున్న తెలుపు, ఎరుపు కలువపూలు. కన్నార్పకుండా చూస్తూ నిలబడింది.

"అమ్మగారు లోపలున్నారు" అన్నాడు డ్రైవర్.

"పద వెళదాం" డ్రైవర్ కారు పార్క్‌చేసి వచ్చి ఆమెతోపాటు లోపలి కొచ్చాడు.

గుడిలోపల ఆవరణంతా చిత్తడి చిత్తడిగా వుంది. కోనేరులో స్నానాలు చేసి ఆడవాళ్ళు తడిబట్టలతోటే లోపలికొస్తున్నారు.

సంహితని చూసి ఊర్మిళ ఎదురొచ్చింది. "ఎలా వున్నావ్?"

"బావున్నా. ఇదిగో ఇలా" అంటూ యజ్ఞగుండం చూపించింది. గుండం చుట్టూ బోలెడంత సామగ్రి పరిచివుంది. చొక్కాల్లేని పురోహితులు గుండ్రటి బొజ్జలతో వరసగా కూర్చుని వున్నారు. ఊర్మిళ భర్త కూడా వారి పక్కన కూర్చుని వున్నాడు. ఈ యజ్ఞాలకి కారకుడైన గురువు కూడా అక్కడున్నాడు. చిన్నకుర్రాడిలా వున్నాడు. పరిశీలనగా చూస్తే మానసిక రోగిలా అన్పిస్తున్నాడు.

"ఇతనా మీ గురువు?"

"నా గురువు కాదు. ఆయనకి గురువు"

"నిన్న రాలేదని ఏమైనా అనుకున్నావా?"

"లేదులే. నిన్న కూడా ఇదే కదా! ఈ పూజ రెండు మూడు గంటలు పడుతుంది. ఏంచేస్తావ్ అంతసేపు. బోర్ కొడుతుందేమో"

"నాకేం ఫర్వాలేదు. బయట కోనేరుంది. దాన్నిండా కలువలున్నాయి. వాటిని చూస్తూ కూర్చుంటాలే" అంది సంహిత.

పురోహిత బృందం ఊర్మిళని పిలిచారు వచ్చి పీటమీద కూర్చోమని. తను వెళ్ళి కూర్చుంది. అందరూ ఒకేసారి గొంతువిప్పి మంత్రాలు చదువుతూ, యజ్ఞగుండంలో ఒక్కో వస్తువూ వెయ్యసాగారు. గరిటెల కొద్దీ నెయ్యి పోస్తున్నారు. నెయ్యి పోసినపుడల్లా గుండంలోంచి మంట ఎగిసిపడుతోంది. ఆ వెంటనే పొగ లేస్తోంది. ఆ పొగకి కళ్ళు మండటం మొదలై సంహిత మెల్లగా అక్కడి నుండి లేచిపోయింది.

గుడి ఆవరణ భక్తులతో కిటకిటలాడిపోతోంది. ఆరోజు శ్రావణ శుక్రవారమనీ, అదంతా వరలక్ష్మీవ్రతం హడావుడని అర్థం కావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. ఎక్కడ ఖాళీగా వుంటే అక్కడ కూర్చుని ఆడవాళ్ళు వ్రతం చేస్తున్నారు. నేలంతా తడితడిగా వుంది. కోనేరులో స్నానాలు చేసి తడిబట్టలతోనే లోపలికొచ్చి పూజకి కూర్చుంటున్నారు.

వరలక్ష్మి వ్రతం సంహిత ఎప్పుడూ చెయ్యలేదు. ఆమె అసలు పూజలే చెయ్యదు. ఇంతమంది ఆడవాళ్ళు తమ భర్తల క్షేమం కోసం తాపత్రయపడడం విభ్రమంగా చూస్తోంది. ఎండ పెరుగుతోంది. చెమటలు కక్కుతూ ఆడవాళ్ళు పూజలు చేస్తూనే వున్నారు. కొంచెం నీడగా వున్న స్థలం చూసుకుని కూర్చుంది. కెమేరా బయటకు తీసి ఫోటోలు తియ్యడం మొదలుపెట్టింది. ఇన్ని వందల మంది స్త్రీలు భర్తల క్షేమం కోసం పూజలు చేస్తున్నారే?... మరి...

కెమేరాలో హఠాత్తుగా దృశ్యం మారిపోయింది. సంభ్రమంగా కళ్ళు విప్పార్చుకుని చూసింది. కెమేరా పక్కకి తొలగించి చూసింది. అదే దృశ్యం... లుంగీలు కట్టుకుని, భుజాలచుట్టూ కండువాలు కప్పుకుని గుంపులు, గుంపులుగా వస్తున్న మగవాళ్ళు. కోనేరులో స్నానాలు చేసి, తడిబట్టలతో, చేతిలో పళ్ళాలు, పళ్ళాల నిండా పూజాసామగ్రి. ఎక్కడ చోటు దొరికితే అక్కడ కూర్చుంటున్నారు. కలశంపెట్టి, దాని మీద కొబ్బరికాయ, కొబ్బరికాయకు బట్టచుట్టి, దానిచుట్టూ పూజా సామగ్రి పరుచుకుంటున్నారు. బాసింపట్టు వేసుక్కూర్చున్న వందలాది మగవాళ్ళు తమ భార్యల క్షేమం కోసం పూజలు చేయడం మొదలు పెట్టారు. ఆడపురోహితులు పూజలు చేయిస్తున్నారు. మంత్రాలు అచ్చ తెలుగులో స్పష్టంగా విన్పిస్తున్నాయి. "నా భార్య ఆయురారోగ్య ఐశ్వర్యాల కోసం నేను త్రికరణ శుద్ధిగా ఈ వ్రతం ఆచరిస్తున్నాను" అంటున్నారు. ఎండ నెత్తిమీదకు వచ్చింది. చెమటలు ధార కడుతున్నాయి. పూజలు చివరిదశకు వచ్చాయి. వ్రతం పూర్తయిన మగవాళ్ళు లేచి నిలబడి, ఆడ పురోహితులకు దక్షిణ, సంభావన ఇచ్చి, వంగి, భక్తిగా కాళ్ళకు మొక్కుతున్నారు. ఆడ పురోహితులు 'ఆయుష్మాన్‌భవ' అంటూ దీవిస్తున్నారు.

హఠాత్తుగా గుడి ఆవరణలో ఏదో కలకలం చెలరేగి కళ్ళు తెరిచి చూసింది సంహిత. అరే! మగాళ్ళంతా ఏరీ? కళ్ళు నులుముకుని చూసేసరికి ఒక్క మగపురుగు కూడా లేదు.

'ఏమయిందే నాగలక్ష్మీ' అరుస్తోంది ఒకామె. సంహిత ఒక్క ఉదుటున లేచి అక్కడికి పరుగెత్తింది. ఒకామె అచేతనంగా నేలమీద పడివుంది. ఆమెచుట్టూ ఆడవాళ్ళు మూగారు. ముఖంమీద కొన్ని నీళ్ళు చిలకరించి నీడగా వున్న చోటుకి చేర్చారామెని. నాగలక్ష్మి నీరసంగా కళ్ళు తెరిచింది. తెరుచుకున్న కళ్ళు ధారలు కట్టాయి.

"అయ్యో! ఇలాగైందేంటి? పూజ సగంలోనే ఆగిపోయింది. ఆయనకు ఏం అరిష్టం జరుగుతుందో ఏంటో?"

"ఏమీ రాయిడే నాగలక్ష్మీ! ఈ సంవత్సరం వ్రతమేదైనా అంటే యున్నావా? అసలే నీరసంగా వున్నావు" నాగలక్ష్మి పక్కన నిలబడ్డ పెద్దావిడ అంది.

"ఏం జరుగుతుందో ఏంటో" అంటూ ఏడవసాగింది.

ఆమెని పరిశీలనగా చూసిన సంహిత ఆశ్చర్యపోయింది. సన్నగా. రివటలాగా వుంది. తెల్లగా పాలిపోయి ఉబ్బిన ముఖం. వంట్లో అసలు రక్తమనేది వుందా అనిపిస్తోంది.

"ఊరుకో నాగలక్ష్మీ! వచ్చేవారం చేసుకుందువుగానిలే" ఊరడించింది ఆవిడ. నాగలక్ష్మి లేచి కూర్చుంది.

ఇంతలో యజ్ఞం పూర్తయిందని. ఊర్మిళ పిలుస్తోందని చెప్పారెవరో.

"ఈవిడ చాలా నీరసంగా వుంది. చల్లగా ఏదైనా తాగిస్తే మంచిది" అని వాళ్ళతో చెప్పి. యజ్ఞం జరుగుతున్న చోటుకి వచ్చింది. ఊర్మిళ స్థితి నాగలక్ష్మికంటే తీసికట్టుగా అనిపించింది. అగ్నిగుండంలోని వేడికి ఆమె ముఖం ఎర్రగా కందిపోయింది. కళ్ళు ఎర్రబడి ఉబ్బిపోయాయి. ఆమె ఉదయంనించి పచ్చిమంచినీళ్ళయినా ముట్టలేదు. యజ్ఞగుండంచుట్టూ మిగిలిన వస్తువులన్నింటినీ ఒకేసారి వేయడంతో మంటలు అంతెత్తున ఎగిసాయి. మంట ఆగగానే పొగకమ్ముకుని అక్కడున్నవాళ్ళు దగ్గుతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆ తర్వాత పురోహితులకి దక్షిణలు. సంభావనలు. ఆశీర్వచనాలు. కాళ్ళు మొక్కడాలు. ఇదంతా పూర్తయ్యేటప్పటికి టైము రెండున్నర దాటింది.

మూడింటికి భోజనాలకి లేపమన్నారు. సంహితకి చాలా ఆకలిగా వుంది. ఉదయం నించీ ఏమీ తినని ఊర్మిళ పరిస్థితి ఏంటో అనుకుంటూ భోజనానికి కూర్చుంది. అయితే వడ్డిస్తున్న వాళ్ళ మురికి అవతారాలు చూసాక ఏమీ తినలేకపోయింది.

***

భోజనాలయ్యాక గెస్ట్‌హౌస్‌కెళ్ళారు అందరూ. నడుం నొప్పిగా వుందని ఊర్మిళ మంచానికడ్డం పడింది.

"ఉదయం నీకు చాలా బోరుకొట్టి వుంటుంది కదూ" అంది ఊర్మిళ.


నాకేం బోరుకొట్టలేదు. కానీ ఇన్ని గంటలు ఆ మంటముందు నువ్వెలా కూర్చోగలిగావ్"


"ఏం చేయను? నడుం బిగుసుకుపోయింది. రేపు మళ్ళీ కూర్చోవాలిగా! అది సరేగాని పొద్దున ఏం చేసావో చెప్పు" అంది.

సంహితకి ఉదయం ఎదురైన వింత అనుభవం గుర్తొచ్చి పడీపడీ నవ్వసాగింది.

"అరే! ఎందుకంతగా నవ్వుతున్నావ్? నాక్కూడా చెప్పు" పళ్ళాలు భుజాల మీద పెట్టుకుని తడి బట్టలతో నడిచొచ్చే మగాళ్ళ గుంపు గుర్తొచ్చి మరింత నవ్వుతూ ఆ సంఘటనను చిత్రాతిచిత్రంగా నవ్వుల మధ్య వర్ణించి చెప్పింది.

"కూర్చుని నిద్రపోయావా? పగటికలలు కన్నావా? మగవాళ్ళు మన కోసం వ్రతాలు. పూజలు చెయ్యడమా? వాళ్ళు వాళ్ళకోసమే చేసుకుంటారు.



వ్? ఆయన ఆరోగ్యం. అభివృద్ధి కోసమూనట" ఊర్మిళ అంది.

"నీకేమీ లాభం లేదా?" సరదాగా అంది.

"ఎందుకు లేదు? ఆయనతోపాటే నాకూ కొంత వస్తుందట".

"అంటే..." "గుళ్ళల్లో అభిషేకాలు చేసినపుడు వినలేదా? గోత్రాలు అడుగుతారు కదా!"

"అవును అడుగుతారు. నా గోత్రమేంటో నాకే తెలియదు".

"పూజార్లు చాలాసార్లు మన పేరు కూడా అడగరు. ఫలానా ఆయన ధర్మపత్నీ సమేత అని మంత్రాలు చదువుతారు. అంటే మనకి ఉనికి వుండదు. ఆయన భార్యగానే గుర్తింపు గుళ్ళల్లో కూడా".

"నిజమే! నాకెప్పుడూ ఓ అనుమానం వస్తూంటుంది. ధర్మపత్నులు. అధర్మపత్నులు..."

"సర్లే! మనం ఇంతకంటే లోతుకి వెళ్ళొద్దు. నేను నీలాగా నాస్తికురాల్ని కాదు కానీ. ఇవన్నీ నాకూ నచ్చవు. కానీ చాలాసార్లు మనకి ఇష్టం లేనివీ చెయ్యాల్సి వస్తుంది". సంహిత తదేకంగా ఊర్మిళను చూస్తుండిపోయింది. అలిసిన ముఖం. ఎర్రగా వుబ్బిన కళ్ళు. ఆమెకు హఠాత్తుగా నాగలక్ష్మి గుర్తొచ్చింది. నాగలక్ష్మి కళ్ళు తిరిగిపడిపోయిన విషయం ఊర్మిళకి చెప్పింది.

"ఇంత చదువుకుని నేనే వీటిని తప్పించుకోలేకపోతున్నాను. పల్లెటూరిపిల్ల. పాపం! ఏం చేయగలుగుతుంది?"

"పైగా ఒకటే ఏడుపు. పూజ ఆగిపోయింది. ఆయనకు ఏమౌతుందో అంటూ ఏడుస్తుంది. తన పరిస్థితి గురించి పట్టింపే లేదు".

"నాకుండా సంహితా! నడుం నొప్పితో ఆ వేడిసెగని భరిస్తూ. చెమటలు కక్కుతూ నేను కూర్చోలేదా? పళ్ళ బిగువున బాధని భరించాను కానీ మధ్యలో లేవగలిగానా? ఇవన్నీ ఎంత మాట్లాడుకున్నా అంతే. నేను కొంచంసేపు పడుకుంటాను. నువ్వు ముందు రూమ్‌లోకెళ్ళి టి.వీ. చూడు. లేదంటే నువ్వు పడుకో" అంది ఊర్మిళ.


***

ముందు గదిలోకొచ్చి టి.వీ. ఆన్‌చేసి కూర్చుంది సంహిత.

"వరలక్ష్మీవ్రత మహత్యం" అంటూ పళ్ళికిలిస్తూ ప్రత్యక్షమైంది ఏంకర్. 'ఛీ... ఇక్కడా ఇదేగోల. కార్తీకదీపాలు. అట్లతద్దె. వరలక్ష్మి వ్రతాలు. అట్లతద్దె నోములూ ఛీ...ఛీ" కోపంగా కసురుతూ టి.వీ. ఆపేసింది. ఈ విషయంలో చదువుకున్నవాళ్ళ పరిస్థితి. చదువురానివాళ్ళ పరిస్థితి ఒకేలా వుండడమే అత్యంత విషాదం. ఊర్మిళ మనసులో ఇంత బాధ వుందని తను అనుకోలేదు. తమ శరీరాలని ఇంత హింస పెట్టుకుని వీళ్ళు బావుకునేదేమిటి? దీనికేమైనా గుర్తింపుందా? ఈ ఆడవాళ్ళకెప్పుడూ పూజలు. నోములూ. వ్రతాలూ అంటూ పీడరింపులు తప్ప దక్కేదేముంది.

(మిగతా 31వ పేజీలో)

*సంహిత తదేకంగా ఊర్మిళను చూస్తుండిపోయింది. అలిసిన ముఖం, ఎర్రగా వుబ్బిన కళ్ళు. ఆమెకు హఠాత్తుగా నాగలక్ష్మి గుర్తొచ్చింది. నాగలక్ష్మి కళ్ళు తిరిగిపడిపోయిన విషయం ఊర్మిళకి చెప్పింది. "ఇంత చదువుకుని నేనే వీటిని తప్పించుకోలేకపోతున్నాను. పల్లెటూరిపిల్ల, పాపం! ఏం చేయగలుగుతుంది?"*





చెల్లారావు

## పుస్తక పఠనం, ధ్యానం

నేను ఎటెండర్‌గా రిటైర్ అయ్యాను. పెద్ద చదువులు చదువుకోకపోయినా రామకృష్ణ పరమహంస, శ్రీరమణమహర్షిల పుస్తకాలు ఎంతో ఇష్టంగా చదువుతాను. నా పని నేను చేసుకుంటూ ఇతరులకు సహాయం చెయ్యాలనే ఉద్దేశం నాది. ముసలివాళ్ళు, బీదవాళ్ళను ప్రేమతో ఆదరిస్తాను. నా సంతానం ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల- ముగ్గురూ మంచి ఉద్యోగాల్లో స్థిరపడి సంతోషంగా ఉన్నారు. మనవళ్ళను స్కూలుకి తీసుకెళ్ళి, తీసుకొస్తుంటాను. ఏదైనా బజారుపని అవసరమైతే ఇప్పటికీ సైకిల్‌పైనే వెళ్ళి వస్తాను. రోజూ 6.30నుంచి 8 గం॥ లవరకు దేవుడిగదిలో ధ్యానం చేసుకుంటాను. భగవంతుని దయవల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా ప్రశాంతంగా జీవిస్తున్నాను. ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను.

- ఆదారి చెల్లారావు,
పెదవాల్తేర్, విశాఖపట్నం


బాపయ్యగుప్త

## కామర్స్ క్లాసులు

నా వయసు 63 సంవత్సరాలు. కామర్స్ లెక్చరర్‌గా, ఆ శాఖాధ్యక్షులుగా పనిచేసి 2002లో పదవీ విరమణ చేసాను. ఉద్యోగం చేసినంత కాలం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభించలేదు. నేను నష్టపోయినా ఫరవాలేదు, కాని నావల్ల సన్నిహితులు, ఆప్తులు, కుటుంబసభ్యులు నష్టపోకూడదనే లక్ష్యంతో ఉండడంవల్ల నేనే అనేక రకాలుగా నష్టపోయాను. రిటైరైన తరువాత ఎక్కువ సమయం ఆధ్యాత్మిక గ్రంథ పఠనకు వినియోగిస్తున్నాను. రోజూ ఉదయం టి.విలో వచ్చే ప్రవచనాలు తప్పని సరిగా వింటాను. విద్యార్థులకు ఉచితంగా కామర్స్ బోధిస్తున్నాను. అడిగిన వారికి కాదనకుండా నాకు చేతనైనంత మేర సహాయ సహకారాలు అందిస్తూ వారికి ధైర్యవచనాలు చెప్తున్నాను. తండ్రినుండి వారసత్వంగా వచ్చిన గాంధీ ఆశయాలను, సిద్ధాంతాలను అమలుచేస్తూ ప్రశాంతమైన జీవనం గడుపుతున్నాను.

- *గొడవర్తి బాపయ్యగుప్త, పొన్నూరు, గుంటూరు జిల్లా*

ఈ శీర్షికలో పాల్గొనాలనుకునే వారికోసం మా చిరునామా: **జీవనసంధ్య,** ఆదివారం వార్త, ఎడిటర్, 'వార్త' లోయర్ టాంక్‌బండ్, హైదరాబాద్-500 080

# చీకటిలోంచి చీకటిలోకి

**(9వ పేజీ తరువాయి)**

వాళ్ళు చేసే పూజల్లో ఒక్కటైనా తమ కోసం వుందా?

ఆలోచిస్తూ... అలాగే కుర్చీలో చేరగిలబడి నిద్రలోకి జారిపోయింది. మూసుకున్న రెప్పలవెనక అదే దృశ్యం. పూజలు చేస్తున్న పురుషులు, కళ్ళు తిరిగిపడిపోతున్న నాగలక్ష్మి, నోములు నోచి నోచి నడుములు ఒంగిపోయిన ఆడవాళ్ళు... అంతా కలగాపులగం.

"సంహితా! ఏం చేస్తున్నావ్? కుర్చీలోనే నిద్రపోతున్నావే?"

కళ్ళు తెరిచి నవ్వుతూ "మగాళ్ళ పూజలూ..."

"నీకు పిచ్చిపట్టింది. గోదావరి గట్టుకు వెళదామన్నావు కదా?"

"నడుం నొప్పి తగ్గిందా? ఫర్వాలేదా?"

"అది అలాగే వుంటుందిలే... ఇక్కడికి దగ్గిరేనా గోదావరి?"

"ఆ... దగ్గరే... కోటిపల్లి అని ఓ ఊరుంది. మనం పడవలో అవతలిగట్టుకి పోవచ్చు" అంది సంతోషంగా.

"సరే అయితే. ముఖాలు కడుకుని టీ తాగిపోదాం".

ఓ అరగంట తర్వాత వాళ్ళెక్కిన కారు కోటిపల్లి వేపు వెళ్ళసాగింది.

"ఊర్మిళా! అదిగో! అదే ద్రాక్షారామం గుడి. రేపు మీ యజ్ఞం అక్కడే".

"సరే నువ్వేం చేస్తావ్ రేపంతా?"

"వ్రతాలు చేసే మగవాళ్ళ గురించి కలలు కంటాలే" అంటూ నవ్వుతూ "నిన్న అక్కడ చిన్న కోనేరు మాత్రమే ఉవంది. కోటిపల్లి రేవులో, రావిచెట్టుకింద కూర్చుంటే గోదారి ఉరకలు, రావి ఆకుల గలగలలు చాలు నాకు. యూ డోంట్ వర్రీ. ఐవిల్ మానేజ్".

"నిజం చెప్పనా! నాకు తెలుసు. నువ్వు మానేజ్ చేస్తావని. యజ్ఞం ఎగ్గొట్టి నేనూ నీతోనే కూర్చుంటే ఎంత బావుండు అన్పిస్తోంది".

"నిజంగానా?"

"నిజంగానే. రేపు ఉదయం నడుంనొప్పి వంకపెట్టి యజ్ఞానికి డుమ్మా కొట్టేస్తా. పద. అటువేపు వెళదాం".

"యు ఆర్ గ్రేట్. పద పోదాం" ఇద్దరూ పడవవేపు అడుగులేసారు.

***

మర్నాడు ఉదయం ఐదింటికే మెలుకువ వచ్చేసింది సంహితకి. కరెంటు పోయినట్టుంది. ఒళ్ళంతా ముద్దయిపోయింది. మెల్లగా లేచి తలుపు తీసుకుని బయటకొచ్చింది. ఇంకా చీకటిగానే వుంది. కోడికూత ఊళ్ళో ప్రతిధ్వనిస్తోంది. కొక్కొరొకో అంటూ బృందగానం చేస్తున్నాయి. కోడిపుంజులు పక్షుల కిలకిలలు కూడా మొదలయ్యాయి. ఎలాగూ ఇంక నిద్రరాదు. కాస్త ఊరిలోకి వాకింగ్‌కి వెళితే బావుంటుంది కదా అనుకుని చెప్పులేసుకుని బయలుదేరింది. సంహిత బయటకి నడవడం చూసి అటెండర్ ఆమెని అనుసరించాడు.

కొంచం దూరం వెళ్ళగానే ఒక ఇంటిదగ్గర జనం గుమికూడి వుండటం కనబడింది.

సంహిత అటు వెళ్ళబోతుంటే

"అమ్మా! అక్కడెవరో పోయినట్టున్నారు. అటొద్దులెండి" అన్నాడు.

"ఫర్వాలేదులే. పద చూద్దాం".

ఏడుపుల శబ్దాలు విన్పిస్తున్నాయి. ఎవరో బిగ్గరగా ఏడుస్తున్నారు. దగ్గరకెళ్ళింది సంహిత.

వాకిట్లో శవాన్ని పడుకోబెట్టారు. తల దగ్గర దీపం వెలుగుతోంది. శవాన్ని పరిశీలనగా చూసిన సంహిత ఆశ్చర్యపోయింది.

నాగలక్ష్మి... నిన్న గుళ్ళో కళ్ళు తిరిగి పడిపోయిన నాగలక్ష్మి. అరరే.... నిన్ననేకదా తాను చూసింది ఆమెని. నీళ్ళు కూడా తాగించింది. పూజ ఆగిపోయినందుకు ఏడ్చింది. తెల్లారేసరికి శవమైపోయిందేమిటి?

"ఏమైందండి..." అని అక్కడ నిలబడిన పెద్దావిడను అడిగింది.

"ఏముందమ్మా! దాని మొగుడు యముడోడు. రాత్రి తాగొచ్చి కొట్టాడంట. ముందే బలహీనంగా వుంది. తట్టుకోలేకపోయింది. ఇదిగో తెల్లారేపాటికి ఇలా శవమైపోయింది" అందావిడ కళ్ళు తుడుచుకుంటూ.

"అయ్యో! ఎంత ఘోరం. నిన్న పూజ ఆగిపోతే తన భర్తకేమవుతుందోనని వెక్కివెక్కి ఏడ్చిన నాగలక్ష్మిని ఆ భర్తే కొట్టి చంపేసాడన్న మాట" సంహితకి మనసంతా వికలమైపోయింది. నిశ్శబ్దంగా అక్కడినుండి వెనుతిరిగి భారంగా అడుగులేస్తూ గెస్ట్‌హౌస్‌వేపు నడవసాగింది. ●